## క్లుప్తంగా

### 108 సేవలపై ఆరా



పరికరాలు, రికార్డులను పరిశీలిస్తున్న హరిప్రసాద్

సారవకోట: మండల కేంద్రంలోని 108 వాహనంలో అత్యవసర సమయంలో వినియోగించే పరికరాలు, వాటి పనితీరు, ఎమర్జెన్సీ డ్రగ్స్ రికార్డులు, సిబ్బంది హాజరు రికార్డులను జిల్లా మేనేజర్ బొమ్మాళి హరిప్రసాద్ గురువారం పరిశీలించారు. అత్యవసర సమయాలలో బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు.

### నాయీబ్రహ్మణ కార్యవర్గం ఎన్నిక



నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులు

హిరమండలం: నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా తొత్తడిపూడి సాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా జి.రామకృష్ణ, కార్యదర్శిగా ఎ.శంకరరావు, కోశాధికారిగా యు.గోవినాథ్, మరికొంత మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

### నియామకం



నారాయణరావు

ఆమదాలవలస: కళింగ సంక్షేమ సేవా సంఘం జిల్లా యూత్ సెక్రటరీగా ఆదాలవలస మండలంలోని వంజంగి గ్రామానికి చెందిన బెండి నారాయణరావు నియామకం అయ్యారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు అందాయని నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కళింగ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీపాన వెంకటరమణ నుంచి ఈ ఉత్తర్వులు అందాయన్నారు. ఈయన నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

### చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న సీఐ దివాకర్

పొందూరు: చెడు వ్యసనాల జోలికి వెళ్లి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఆమదాలవలస సీఐ దివాకర్ అన్నారు. స్థానిక సిస్టం కళాశాలలో గురువారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కు అలవాటుకు దూరంగా ఉండాలన్నారు. ఎస్‌ఐ వెంకటరమణ, కరస్పాండెంట్ మొదలవలస మోహన్‌రావు, హెచ్‌సీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### చురుగ్గా కల్వర్టు నిర్మాణం



శ్లాబ్ పనులు చేపడుతున్న దృశ్యం

కొత్తూరు: మండల కేంద్రంలోని అల్లు వీధిలో కల్వర్టు నిర్మాణ పనులను సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావు సమక్షంలో చేపడుతున్నారు. గత పది రోజుల నుంచి జరుగుతున్న పనుల్లో భాగంగా గురువారం కల్వర్టు శ్లాబ్ ఏర్పాటు చేశారు. మురుగు నీటి సమస్యపై సర్పంచ్‌కు ఫిర్యాదు చేయడంతో స్పందించి కల్వర్టు నిర్మాణం చేపడుతున్నారు.

### హెల్మెట్ ధారణ తప్పనిసరి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మణి

ఆమదాలవలస: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి ప్రాణరక్షణ పొందాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి సూచంచారు. కోర్టు ఆవరణలో హెల్మెట్ వినియోగంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. హెల్మెట్‌ను ధరించడం బరువుగా కాకుండా బాధ్యతగా భావించాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఏజీపీ సీపాన గోవిందరావు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పైడి వరహానరసింహం, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ● ఉపాధితో ప్రయోజనం



ప్రజలకు ఉపయోగపడేలా ఉపాధి హామీ పనులు నిర్వహించాలని సరుబుజ్జిలి మండంలోని పురుషోత్తపురం పంచాయతీ ఉపసర్పంచ్ పైడి నర్సింహప్పారావు తెలిపారు. సచివాలయం ఆవరణలో గురువారం ఉపాధి హామీ సోషల్ ఆడిట్ గ్రామసభ నిర్వహించారు. ఉపాధి పనులు, చెల్లింపుల వివరాలను సోషల్ ఆడిట్ బృందం చదివి వినిపించారు. ఏపీఓ పార్వతి, ఫీల్డ్‌అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శి అప్పలనాయుడు పాల్గొన్నారు.

- సరుబుజ్జిలి

## ● వైద్య శిబిరం



హిరమండలం మండలంలోని అక్కరాపల్లి గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రం ఆవరణంలో అమ్మన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జెమ్స్ ఆస్పత్రి వైద్యులు హరికృష్ణ 48 మందికి వైద్య తనిఖీలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. ట్రస్టు అధ్యక్షుడు తంగి రమేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

- హిరమండలం

## ● వితరణ



దాతల సహకారం గొప్పదని జలుమూరు బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం ఇప్పిలి వేణు గోపాలరావు అన్నారు. పాఠశాలలో పని చేస్తున్న తెలుగు ఉపాధ్యాయురాలు పల్లి సుశీల మాతృమూర్తి రాములమ్మ జ్ఞాపకార్థం రూ.5 వేల విలువల చేసే పుస్తకాలను గురువారం అందించారు. దీంతోపాటు కొంత మొత్తం నగదు అందజేశారు. శిక్షా సప్తాహ్ విద్యా వారోత్సవాల్లో భాగంగా ఆటలు, సాంస్కృతి కార్యక్రమాలకు సద్వినియోగం చేయాలని కోరారు.

- జలుమూరు

## ● పొలం బడి



మేలైన వ్యవసాయ పద్ధతల్లో వరి పంట సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని జలుమూరు మండల వ్యవసాయశాఖ అధికారి కె.సురేష్ అన్నారు. పొలం బడి కార్యక్రమంలో భాగంగా గురువారం అక్కురాడలో శ్రీ వరి సాగు పద్ధతిలో వరి నాట్లు వేయడం, మెలకువలు, యాజమాన్య పద్ధతులు వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వాసుదేవరావు, నవ్య, శివచ రణ్, రైతు వెలమల రామరాజు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

- జలుమూరు

## ● పూడిక తొలగింపు



హిరమండలంలోని వంశధార కుడి ప్రధాన కాలువలో పూడికతీత పనులు ఇటీవల నిర్వహించారు. పూడికను తీసి కాలువ గట్టు అంచు భాగంలో వేయడంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఆ మట్టి తిరిగి కాలువలో జారిపడింది. 'ఇవేం పనులు' అనే శీర్షిక ఈ నెల 15న సాక్షిలో వార్త ప్రచురతమైంది. వంశధార అధికారులు గురువారం స్పందించా రు. గట్టు అంచున ఉన్న పూడికను తరలించారు.

- హిరమండలం

# ఎరువుల కొరత..!

- ఆర్‌బీకేల్లో నిండుకున్న నిల్వలు
- డీఏపీ సరఫరాలో చేతులెత్తేస్తున్న అధికారులు
- ప్రైవేట్ వ్యాపారులే దిక్కు..



సత్యవరంలో ఖాళీగా ఉన్న ఆర్‌బీకే

నరసన్నపేట: సకాలంలో అవసరమైన ఎరువుల అందక నియోజకవర్గ రైతులు అవస్థలు పడుతున్నారు. ఐదేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎటువంటి ఇబ్బందులు పడ్డారో అటువంటివే మళ్లీ మొదలు అవుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో ఎరువులు అవసరం మేరకు, ప్రభుత్వ ధరలకు రైతులకు లభించేవి. ఆర్‌బీకేల్లో రైతులు ముందుగా డబ్బులు చెల్లిస్తే సకాలంలో రైతు చెంతకే వచ్చేవి. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. ఎరువుల కోసం ఊరూరా తిరుగుతున్నారు. ప్రధానంగా ప్రైవేట్ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తుంది. ఆర్‌బీకేల్లో ఎరువులు బుక్ చేయడం లేదు. ఉన్న నిల్వలు నిండు కున్నాయి. ప్రస్తుతం రైతులకు డీఏపీ ఎరువు అవసరం. డీఏపీ దొరకక అవస్థలు పడుతున్నారు. వ్యవసాయశాఖ పూర్తిగా చేతులెత్తేసింది. మేం ఏమీ చేయలేమని తప్పించుకుంటున్నారు. ఖరీఫ్ ప్రారంభంలోనే ఎరువుల కష్టాలు మొదలయ్యాయి. ఆర్‌బీకేల ద్వారా డీఏపీ ఇస్తారని రైతులు ఆశించారు. అవసరం మేరకు సరఫరా చేయలేక పోయారు. యూరియా సరఫరాలో కూడా ఇదే పరిస్థితిలో ఉంది. అదికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు. ప్రైవేట్ వ్యాపారుల వద్దకు వెళ్తే అధిక ధరలు చెబుతున్నారని, ఇతర ఎరువులు లింకు పెడుతున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు.

నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో చేపట్టిన ఎరువుల ప్రతిపాదనలు, చేపట్టిన సరఫరా వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

| మండలం | ప్రతిపాదనలు | ఈ ఏడాది సరఫరా చేసినవి | గతేడాది సరఫరా చేసినవి |
|---|---|---|---|
| నరసన్నపేట | 2,352 | 389 | 1,306 |
| పోలాకి | 2,603 | 179 | 553 |
| జలుమూరు | 2,461 | 140 | 1,132 |
| సారవకోట | 1,992 | 399 | 1,056 |

### ఎరువులు పంపిణీ చేయలేదు



గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఈ సరికే రైతులకు యూరియా, డీఏపీ పంపిణీ చేయడం జరిగింది. ప్రస్తుతం ఖరీఫ్‌లో ఎరువుల పంపిణీ ఇంకా చేయలేదు. రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో రైతుకు ఒక బస్తా యూరియా ఇస్తామంటున్నారు. అదీ ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు. డీఏపీ కొరతగా ఉంది.

– తవిటినాయుడు (శ్రీను), రైతు, లుకలాం, నరసన్నపేట మండలం

### ప్రైవేట్ వ్యాపారుల వద్దే కొనుగోలు చేస్తున్నాం..



కావాల్సిన ఎరువులు ప్రైవేట్ వ్యాపారుల వద్దే కొనుగోలు చేస్తున్నాం. ఆర్‌బీకేల ద్వారా ఎరువులు అందడం లేదు. ఇప్పుడు డీఏపీ అవసరం. యూరియా కూడా ముందస్తుగా రైతులు నిల్వ చేసుకుంటున్నారు. గతంలో ఎరువులు ఆర్‌బీకేల్లో సక్రమంగా అందేవి.

– పాగోటి ప్రభాకర్, రైతు, కంబకాయ, నరసన్నపేట మండలం

### నివేదికలు పంపించాం

నరసన్నపేట సబ్ డివిజన్‌లో వరి అధికంగా పండిస్తున్నారు. ఎరువుల డిమాండ్ కూడా అధికంగా ఉంది. దీనికి తగ్గట్టుగా ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతానికి డీఏపీ కావాలని రైతులు అడగుతున్నారు. ప్రాధాన్యత మేరకు రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఆగస్టులో యూరియా డిమాండ్ అధికంగా ఉంటుంది. ఈ మేరకు సరఫరా చేయాలని పైఅధికారులకు నివేదికలు పంపాం.

– రవీంద్రభారతి, ఏడీ, వ్యవసాయశాఖ నరసన్నపేట

# వ్యవసాయానికి అరకొర నిధులు



జి.సింహాచలం

హిరమండలం: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయానికి అరకొర నిధులు కేటాయించి రైతులను తీవ్ర నిరాశకు గురిచేసిందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరావు సింహాచలం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణాల మాఫీ, మద్దతు ధరల గ్యారెంటీ చట్టం ప్రస్తావన లేకపోవడం అన్యాయమన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన రూ.48 లక్షల కోట్ల బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు కేవలం రూ.1.52 లక్షల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. దేశంలో 60 శాతానికి పైగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడ్డారన్నారు. ఈ రంగానికి కనీసం 10 శాతం నిధులైనా కేటాయించాలన్నారు. పసల్ బీమా పథకానికి గత ఏడాది కంటే రూ.400 కోట్లు తగ్గించారన్నారు. ఎరువుల సబ్సిడీకి గత ఆర్థిక సంవత్సరంలో రూ.1.88 లక్షల కోట్లు కేటాయిస్తే.. ప్రస్తుతం రూ.1.66 కోట్లు కేటాయించారన్నారు. నూనెగింజలు, పప్పుధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధిస్తామని చెబుతూనే.. విదేశీ దిగుమతులపై సుంకాలను పూర్తిగా ఎత్తివేయడం దేశీయ వ్యవసాయాన్ని దెబ్బతీయడమేనన్నారు. కౌలు రైతులను పూర్తిగా విస్మరించారన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు నిధులు కేటాయింపులు లేవన్నారు. టీడీపీ మద్దతుపై ఆధారపడి కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యత ఇస్తుందని అందరూ ఆశించారన్నారు. రాష్ట్రానికి, జిల్లాకు ఏమాత్రం ప్రాధన్యత ఇవ్వలేదన్నారు. ఉపాధి హామీ చట్టానికి స్వల్ప నిధులు కేటాయించి పేదలకు అన్యాయం చేశారన్నారు.

# మందులు అందుబాటులో ఉంచుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గిరిబాల

ఎల్.ఎన్.పేట: వర్షా కాలంలో వచ్చే వ్యాధులను తగ్గించేందుకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని వైద్యులను ఎంపీడీఓ గిరిబాల సూచించారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. వర్షా కాలంలో అనేక రకాల జ్వరాలతోపాటు అతిసార వ్యాధులు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉందన్నారు. రైతులు పొలం పనులు చేసే సమయంలో పాము కాటు బారినపడే అవకాశం ఉన్నందున అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. 24 గంటల పాటూ డాక్టర్లతోపాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. రిఫరల్ కేసులు సంఖ్య తగ్గాలన్నారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా పనిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు సునీత, ప్రియాంక, ఈఓపీఆర్డీ పద్మజ, సర్పంచ్ ముగడ దివాకర్ నాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ఆధార్ కేంద్రం పరిశీలన



బూతగూడ ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొత్తూరు: మండలంలోని గురండి, బూతగూడతో పాటు పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఎంపీడీఓ త్రివిక్రమరావు గురువారం పరిశీలించారు. ఆధార్ కార్డు నమోదుకు వచ్చిన వారికి అసౌకర్యానికి గురిచేయకుండ సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో ఆధార్ కార్డు ప్రత్యేక డ్రైవ్‌పై అవగాహన కల్పించాలని గ్రామ సచివాలయం సిబ్బందికి ఆదేశించారు.

# అభివృద్ధి పనులు ప్రారంభం



ప్లాట్ ఫామ్ పనులు చేపడుతున్న దృశ్యం

పాతపట్నం: పాతపట్నం రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్ అభివృద్ధి పనులను రైల్వే అధికారులు గురువారం ప్రారంభించారు. మరో వారం రోజులపాటు జరుగుతాయన్నారు. గతంలో ప్రయాణికులకు రైలు ఎక్కలన్నా, దిగాలన్నా ప్రమాదకరంగా ఉండేది. ప్లాట్ ఫామ్ రెండు అడుగుల లోతుగా ఉండడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడేవారు. ప్రతీరోజు పూరి-గుణుపూర్, విశాఖపట్నం-గుణుపూర్, కటక్-గుణుపూర్, గుణుపూర్-పలాస రైళ్లు పాతపట్నం రైల్వే స్టేషన్ మీదుగా వెళ్తాయి. రాత్రి సమయంలో విద్యుత్ లైట్లు, కుర్చీలు లేకపోవడం వల్ల ఇబ్బందులు తప్పలేదు. పాతపట్నం, టెక్కలి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను రూ.1.20 కోట్లతో చేపడుతున్నారు.

### ఎంపీడీఓ మృతికి సంతాపం



వెంకటరమణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది

మెళియాపుట్టి: నరసాపురం ఎంపీడీఓ వెంకటరమణ ఇటీవల ప్రమాదవశాత్తూ మృతి చెందారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటరమణ చిత్రపటానికి మండల పరిషత్ ఉద్యోగులు నివాళులర్పించారు. మెళియాపుట్టి ఎంపీడీఓ భాస్కరరావు తదితరులు ఉన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సారవకోట: మండలంలోని నౌతళ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించడం, ఇతర నిర్వాహణ పనులు శుక్రవారం చేయనున్నామన్నారు. ఈ మేరకు ఈఈ శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల నౌతల, బొంతు, నారాయణపురం, దాసుపురం, ధర్మలక్ష్మీపురం తదితర గ్రామాల్లో నిలుపుదల సరఫరా నిపుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

**కొత్తూరు మండలంలో..**

కొత్తూరు: ఈ నెల 26న కొత్తూరు 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు కొత్తూరు ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొత్తూరు నుంచి మెట్టూరు గ్రామాల మధ్య విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

**ఎల్.ఎన్.పేట మండలంలో..**

ఎల్.ఎన్.పేట: మండలంలోని రావిచంద్రి విద్యుత్ సబ్ స్టేషన్ స్కాట్‌పేట ఫీడర్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వైర్లు సరిచేయటం, చెట్లు కొమ్మలు తొలగింపు వంటి పనులు చేస్తున్నట్లు వివరించారు. స్కాట్‌పేట, మోదుగువలస, గొట్టిపల్లి, కొమ్ముువలస, చిన్నకొల్లివలస ఆర్‌ఆర్ కాలనీ, ఎల్.ఎన్.పేట, యంబరాం, ఫాక్సుదొరపేట, బొడ్డవలస, కోవిలాం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

**పాతపట్నం మండలంలో..**

పాతపట్నం: మండలంలోని రొంపివలస 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం మరమ్మతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ టెక్కలి ఈఈ జి.శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రొంపివలస, రొమదల, ఆర్.ఎల్.పురం, ఏ.ఎస్.కవిటి, చాకిపల్లి, బైదలాపురం, సీది, తీమర, తామర, సోద, ఎస్.ఎస్.మనుగు, నల్లబొంతు, రెంగూడ, లక్ష్మిగూడ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

# జ్వరాలపై ఇంటింటా సర్వే



వైద్య తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యాధికారి యశ్వంత్

హిరమండలం: మండలంలోని గులుమూరు గ్రామంలో ఆరుగురు జ్వరాల బారినపడటంతో చొర్లంగి పీహెచ్‌సీ వైద్యాధికారి యశ్వంత్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి గ్రామంలోని 250 ఇళ్లకు వెళ్లి జ్వరాలపై సర్వే చేపట్టారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు నిర్వహించారు. ఇళ్ల ఆవరణల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అంటువ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు, ధనుపురం సర్పంచ్ ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న మెడికల్ అధికారి శ్రీకాంత్

జలుమూరు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా తదితర వ్యాధులు సోకేందుకు అవకాశముందని జలుమూరు పీహెచ్‌సీ మెడికల్ అధికల్ అధికారి తాడేల శ్రీకాంత్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశలతో గురువారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో అపరిశుభ్రత వాతావరణం ఉంటే పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి బావుల్లో క్లోరినేషన్ చేయడం, వేడి ఆహారం తినడం, నీరు తాగడం చేయాలన్నారు. దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. రక్తపూత నమూనాలు సేకరించి పరీక్షలు జరపాలన్నారు. సీహెచ్ఓ పద్మావతి, హెచ్ఎస్ చిన్నరాజులు, ఆప్తామాలిక్ రాజు, హెచ్ఏ చిన్నారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్య పరిష్కరించాలి



ఎంఈఓలకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కొత్తూరు: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బోడ శ్రీను, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు శోభన్‌బాబు, విజయ్‌కుమార్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓలు శ్రీనివాసరావు, గోవిందరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఒకే పాఠశాలలో తరగతులు నిర్వహించాలని కోరారు. జీఓ నంబర్ 117 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ నాయకులు తిరుమలరావు, మధు, సంగమేశ్వరరావు, కొండలరావు, బాలకృష్ణ, ఉమామహేష్, దినేష్, కృష్ణ, చంద్రరరావు, ఈశ్వరరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్గత ఆడిట్ తప్పనిసరి

ఆమదాలవలస: మహిళా స్వయం శక్తి సంఘాలతో అంతర్గత ఆడిట్ తప్పనిసరిగా చేయించాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి అన్నారు. మండలంలోని బొబ్బిలిపేట గ్రామ సంఘంలో అధ్యక్షురాలు పైడి వనజాక్షి ఆధ్వర్యంలో గురువారం రికార్డులను పరిశీలించారు. స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి పథకం ద్వారా తీసుకున్న రుణాలతో చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. అప్పులను తిరిగి చెల్లించేటప్పుడు ప్రతి సంఘం కూడా తప్పనిసరిగా రసీదులు పొందాలన్నారు. స్త్రీనిధిలో ఎవరు కట్టిన డబ్బులు వారికే సర్దుబాటు చేయించాలన్నారు. అప్పు కట్టిన ప్రతి సంఘం కూడా గ్రామ సంఘ రికార్డుల్లో అప్పుల నిల్వలను నెలవారీ సమావేశాలకు హాజరై తెలుసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక సంఘం కట్టిన డబ్బులను ఇంకో సంఘానికి తప్పుగా నమోదు చేస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు.వ్యక్తిగతంగా ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న సంఘ సభ్యులకు బ్యాంకు ద్వారా రుణాలను అందిస్తామన్నారు. వీటిని సంఘ సభ్యులు వినియోగించుకోవాలన్నారు. క్లస్టర్ కో ఆర్డినేటర్ సుభద్ర, వీఓఏ, జి.శ్యామల, గ్రామ సంఘం ప్రతినిధులు, స్వయం శక్తి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

### పశువులకు లంపీస్కిన్ టీకాలు



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ సావిత్రమ్మ

పాతపట్నం: పశువులకు తప్పనిసరిగా లంపీ స్కిన్ టీకాలు వేయించాలని ఎంపీపీ దొర సావిత్రమ్మ అన్నారు. మండలంలోని లాబర గ్రామంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో టీకా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఏడీ కరుణాకరరావు, సర్పంచ్ గార కాంతరావు, పశువైద్యురాలు మౌనిక, రైతులు పాల్గొన్నారు.

### ఘనంగా సాంస్కృతిక దినోత్సవం



అంబావల్లి పాఠశాలలో వివిధ వేషధారణల్లో విద్యార్థులు

హిరమండలం: మండలంలోని సవర చొర్లంగి ప్రాథమిక, అంబావల్లి ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు సాంస్కృతిక దినోత్సవం కార్యక్రమం గురువారం ఆయా పాఠశాలల హెచ్ఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురుని ఆకట్టుకున్నాయి. హెచ్ఎంలు లక్ష్మణరావు, రమణ మాట్లాడుతూ శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మన సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు అర్థమయ్యేలా నాటికల రూపంలో తెలియజేశామన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఓడీఎఫ్ సర్వే వేగవంతం చేయండి

పాతపట్నం: ఓడీఎఫ్-ప్లస్‌పై గ్రామాల్లో ఇంటింటా సర్వే వేగవంతంగా చేపట్టాలని ఎంపీడీఓ రామకృష్ణరాజు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఓడీఎఫ్ సర్వేపై సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా గ్రామాలు ఎలా ఉన్నాయనే దానిపై సర్వే చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రతపై కార్యదర్శులకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈఓపీఆర్డీ కృష్ణారావు పాల్గొన్నారు.